


## ‘అ ఆ‘ లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

### మా మంచి గురువులు

డా.కనుపర్తి విజయలక్ష్మి

ఏమీ తెలియని మట్టిముద్దలాటి మొద్దబ్బాయిల్ని, అమ్మాయిల్ని అందమైన బొమ్మలుగ తీర్చిదిద్దటంలో ఎంత కృషి ఉందో! ఒకరా ఇద్దరా ఎందరో మహానుభావులు!! బడిలో అడుగుపెట్టింది మొదలు పి.జి. డిగ్రీతో బయట పడే పదహారు పదిహేడు సంవత్సరాల అధ్యయనంలో ‘మనిషి‘గ మలిచేందుకు ఎందరి తోడ్పాటు అవసరమయిందో. కొందరు పాఠం మాత్రమే చెబుతారు! మరి కొందరు జీవన పోరాటపు ఆరాటాన్ని వివరిస్తారు! ఇంకొందరు గెలుపు బాటలో పయనించే మెలుకువలు నేర్పుతారు. అతి కొద్దిమంది మాత్రమే గుండెలో గూడు కట్టుకుని జీవితాంతం వరకు ఏదో సందర్భంలో తమ బోధనను వినిపిస్తూనే ఉంటారు!

మేము ప్రాథమిక విద్యనభ్యసించే నాటి రోజుల్లో కాన్వెంట్లు లేవు. ఐదో తరగతి వరకు ఎ.బి.సి.డి.లతో పనే లేదు. పలకా బలపం నాలుగు పుస్తకాలు... బరువు లేదు. బలుపు లేదు ‘ఎవ్వని చే జనించు జగమెవ్వని లోపలనుండు. ‘తల్లీ నిన్ను దలంచి పుస్తకమున్ చేతన్ బూనితిన్....‘ అనే ప్రార్థనతో మొదలై సాయంకాలం ఎక్కాలు అప్పచెప్పటం వల్లె వేయటంతో ముగిసేది. ముఖ్యంగా సాయంకాలం చెట్ల కింద ఆరు బయట ఇసుకలో కూర్చుని ప్రకాశరావు పంతులు గారి వైపు చూస్తూ ఎక్కం అప్పగించటం ఇంకా బాగా గుర్తు. నా వంతుకి పదో ఎక్కంగానీ, పదకొండో ఎక్కంగాని వస్తే ఎంత బాగుండుననుకుంటుంటే ఆయన తొమ్మిదిగాని, పదమూడో ఎక్కంగాని అప్పగించమనేవారు. గుండె దడదడలాడేది!

ఆరో క్లాసులో ఇంగ్లీషు, హిందీ... కొత్తగా పెట్టిన మిడిల్ స్కూల్... హెడ్మాస్టారుగా వచ్చిన ‘శర్మ‘గారు మాట ఎంత మృదువో మనిషి అంతకంటే సుకుమారుడు... మనసు అంతకంటే సుతిమెత్తన. ఆ పల్లెటూరులో ఆయన్ని అభిమానించని వారెవరు లేరు. ఆయన్ని ప్రేమించని విద్యార్థీ ఎవరూ లేరు. ఆయన్ని అభిమానించి గౌరవించడం మాకందరికి తెలుసు. ముఖ్యంగా నన్ను మరీ ప్రేమగా, ఆప్యాయంగా చూసేవారు. అబ్బాయిల్ని అమ్మాయిల్ని విహారయాత్రకు అతిజాగ్రత్తగా తీసుకెళ్ళి తీసుకొచ్చేవారు. ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు అంతగా లేనపుడు కూడా ఆయన అంత సాహసం చేసారు.

అపుడు హైస్కూల్ అంటే ఎస్.ఎస్.ఎల్.సి. మా గ్రామంలో మాతోటే ఫస్ట్‌బ్యాచ్ మొదలు. మొత్తం టీచర్లందరు పరీక్షకెళ్ళే 20 మంది పాసవాలని గట్టి కృషిచేసారు. మమ్మల్ని అట్లాగే చదివించేవారు. తెలుగు మాష్టారు పద్యం చదవటమంటే గుర్రం కదను తొక్కినట్లుండాలి అని అట్లా చదివించేవారు. సోషల్ మాష్టారు చరిత్ర పట్ల ఎంతటి మక్కువను కలిగించారో చెప్పలేను. సైన్సు, లెక్కలు చెప్పే మాష్టారు పరమ స్ట్రిక్టు..... హిందీ మాష్టారు ఆచార్లుగారు... హిందీని మాట్లాడేంతగ హిందీ పాటలు రేడియోలోవి వింటే అర్థం అయేంతలాగా చెప్పారు..... ఇక అందరి కంటే చివర చెప్పుకున్నా మొదటగా చెప్పుకోవలసిన వ్యక్తి. హెడ్‌మాస్టరు గారు... ఇంగ్లీషు గ్రామర్ ఎంత బాగా చెప్పారంటే ఆయన చెప్పిన డైరెక్ట్ ఇండైరెక్ట్ స్పీచ్ మార్చటం, ఆక్టివ్ వాయిస్, పాజిటివ్ వాయిస్ బోర్డ్ మీద వ్రాయించటం ఇప్పటికీ మరచిపోలేను. కళ్ళముందు కనిపిస్తూ ఉంటుంది.

అన్నిటికంటే ఆయన మమ్మల్ని నిజాయితీపరులుగా నీతిమంతులుగా తయారు చేసిన వైనాన్ని జీవితాంతం గుర్తుంచుకోతగింది. ప్రతిరోజూ ఇంగ్లీషు స్పీచ్‌లు, పద్యాలు చూడకుండా వ్రాయించేవారు. అంతేకాదు ఓ కొత్త ప్రయోగం చేసారు. ఇన్విజిలేటర్ లేకుండా పరీక్ష వ్రాసే విధానం. కొశ్చెన్ పేపర్స్ ఆన్సర్ పేపర్స్ ఇచ్చేసి, ఎడిషనల్స్ టేబుల్ పై ఉంచి విద్యార్థుల్నే స్వయంగా తీసుకొని పరీక్ష వ్రాయమనేవారు. తాను చేసిన ఈ ప్రయోగం ఎట్లా కొనసాగుతుందో ఊరి పెద్దల్ని పిలిచి చూడమనేవారు. కిటికీల నుండీ మాకు తెలియకుండా పెద్దలు మమ్మల్ని గమనించేవారు. ఇట్లా చేయుటం వల్ల మాలో నైతిక విలువలకు పునాది ఏర్పరిచారు.

ఇక చదువు ఒక్కటే కాదు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రతిభాపాటవాలు బయటకు తేవాలనే ఆలోచనతో, నలుగురి ముందు చక్కగా మాట్లాడగలగాలనే ఉద్దేశంతో ప్రతి శనివారం డిబేట్ పెట్టేవారు. నేనే ఆ కార్యక్రమానికి సెక్రటరీని. అట్లా అక్కడ నిర్భయంగా మాట్లాడే ఆ అలవాటే తదనంతర కాలంలో ఎంతో పనికి వచ్చింది.

భగవద్గీత అంటే ఏమిటో కూడా తెలీని ఆ వయసులో ఆయన గీతలోని శ్లోకాలు కొన్నింటిని భావంతో సహా అప్పగించుకునేలా చేసారు. గీతాపఠనం పోటీలు పెట్టారు. ప్రతి ఒక్కరు స్పష్టంగా బిగ్గరగా చదవాలని మోరల్ ఇన్‌స్ట్రక్షన్ క్లాసులో శ్లోకాలను నేర్పించే బాధ్యత హిందీ మాష్టారికి అప్పగించారు.

*ఇదంతా నా హైస్కూలు చదువులో పందిళ్ళపల్లి గ్రామంలో (ఇప్పటి ప్రకాశం - అప్పటి గుంటూరు జిల్లా) 1966 నాటి మాట...* అపుడు ఏ విద్యా కమీషన్స్ పిల్లల్ని ఇలా తీర్చిదిద్దాలని చెప్పనవసరంలేకుండానే నడతను తీర్చిదిద్దిన ఘనత నాటి మాష్టర్లది.... వీళ్ళందరితో పాటు ఏది అవసరమైనా అనుమానం వచ్చిన వెంటనే తీర్చే నాన్న పందిళ్ళపల్లి గ్రామ కరణం కనుపర్తి గోపాలకృష్ణారావు గారు. నా అసలు గురువు ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో సంతకం పెడుతు ఎన్ని మార్కులొచ్చినా తక్కువే అని అంటూ చాటుగా అమ్మతో పొగడటం విన్నాను ఎన్నోసార్లు! తొమ్మిదిమంది సంతానం, ఏడుగురమ్మాయిలు చివర ఇద్దరబ్బాయిలు. అయినా దగ్గరలోని చీరాల పట్టణం పంపి నన్ను మా అక్కను చదివించటంలో అమ్మ సాహసం ఇక్కడ చెప్పుకోవాలి... హాస్టల్స్ లేవు స్వయంగా వంటా - వార్పు.

డిగ్రీలో ఎన్ని సబ్జెక్టులున్నా తెలుగు మేడమ్ పుల్లమాంబగారిదే అగ్రస్థానం. ఇంగ్లీషు మేడమ్ ప్రభావతిగారు ఆమె చెప్పిన జూలియస్ సీజర్ డ్రామా, హిస్టరీ చెప్పే గిరిజా మేడమ్ కూడా ఎంతో గుర్తుండిపోయారు. మాతో పాటే మొదలయ్యింది చీరాల్లో ప్రభుత్వ కళాశాల. తక్కువమంది విద్యార్థులం. బిఎస్సీ, బి.ఏ లు కలిసే కూర్చునే వాళ్ళం .

పుల్లమాంబగారు పద్యాన్ని స్పష్టంగా అర్థవంతంగా చదవటం.. తీయని ఆ కంఠస్వరం. ఆ పద్యం చదివే తీరే నేననుసరించేలా చేసింది. అన్నిటికంటే ముఖ్యంగా ఆమె ఎంతో ప్రేమగా విద్యార్థినులను "ఏమోయ్" అని సంబోధించేవారు. అందమైన ఆమె రూపం, ప్రేమాస్పదమైన ఆ పలకరింపు, పాఠం చెప్పే ఆ తీరు ఎంతో ప్రభావితం చేసాయి నన్ను. నేను నా ఉద్యోగ జీవితం మొత్తంలో అబ్బాయిలనయితే 'ఏమయ్యా' అని అమ్మాయిలనయితే 'ఏమ్మా' అని తప్ప 'అరేయ్' ఒరేయ్' అని ఎప్పుడూ అనలేదు.

ఆ తర్వాత పి.జి, ఎం.ఫిల్. పి.హెచ్.డి, బి.యిడి.... ఇలా ఎన్నో డిగ్రీలు సంపాదించినా నా హైస్కూల్ డిగ్రీ స్థాయి చదువు బోధించిన వారే నన్నెక్కువ ప్రభావితం చేసారు.

కొందరు గురువులు సరస్వతీ స్వరూపులు. వాళ్ళసలు పిల్లలకి పాఠాలు చెప్పటానికే పుట్టారా అన్నట్లుండేవారు. కొందరు బద్ధకస్తులు ఉన్నారు. అందుకే వారిని జీతాలు పంతుళ్ళంటాం... వీరిని జీవితాన్నర్పించి జీవితాలు దిద్దిన పంతుళ్ళంటాం. తరగతి గదుల్లోనే విద్యార్థి వ్యక్తిత్వానికి పునాదులు పడాలంటారు అట్లాంటి సంపూర్ణ మూర్తిమత్వానికి కావలసిన నాంది పలికిన మహాత్ములకు మనఃపూర్వక నమోవాకాలు.



*రాజమండ్రి విమెన్స్ కాలేజీలో చాలా కాలం పనిచేసిన విజయలక్ష్మి గారు, రామచంద్రాపురం వి.ఎస్.ఎమ్ కాలేజీ నుంచీ పదవీ విరమణ చేశారు. తెలుగులో మంచి రచనలు చేశారు.*